ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

A.C.O - 9003200801
S.R - 9551168092

27/11, సౌందరరాజన్ స్ట్రీట్, టి.నగర్, చెన్నై-600017



యువకులను పరుగులెత్తిస్తున్న ఎద్దు

రంకెలేసిన జల్లికట్టు ఎద్దులు

పెరంబూర్, ఫిబ్రవరి 4: పుదుకోట జిల్లా కుళత్తూర్‌లో ఆదివారం జల్లికట్టు పోటీలు కోలాహలంగా సాగాయి. కుళత్తూర్ సెల్లరియమ్మన్ ఆలయ ఉత్సవాల సందర్భంగా పెరియకుళంలో ఆదివారం ఈ పోటీలు నిర్వహించారు. పోటీలను డీఎంకే ఉత్తర జిల్లా కార్యదర్శి కేకే చెల్లపాండ్యన్ జెండా ఊపి ప్రారంభించారు. పుదుకోట, తిరుచ్చి, తంజావూరు, శివగంగ ప్రాంతాలకు చెందిన సుమారు 700 ఎద్దులు పాల్గొన్నాయి. వాడివాసల్ నుంచి రంకెలేస్తూ దూసుకొస్తున్న ఎద్దులను అణచేందుకు 300మంది యువకులు పోటీపడ్డారు. ఎక్కువ ఎద్దులు అణచిన యువకులు, యువకులకు చిక్కకుండా వెళ్లిన ఎద్దుల యజమానులకు నగదు, బంగారు, వెండి నాణేలు, విలువైన వస్తువులను బహుమతులుగా అందజేశారు. పుదుకోట సహా చుట్టుపక్కల జిల్లాలకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఎద్దులను అణచి వేస్తున్న యువకులను ఉత్సాహపరిచారు. గాయపడిన యువకులకు చికిత్సలందించేలా అంబులెన్స్‌తో కూడిన వైద్య బృందాలు సిద్ధంగా ఉండగా, వేడుకల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఎద్దును అణచివేస్తున్న యువకులు

మేనిఫెస్టో రూపకల్పనలో పార్టీలు బిజీ

ప్యారీస్, ఫిబ్రవరి 4: పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి తయారు చేయనున్న మేనిఫెస్టోలో పొందుపరచాల్సిన అంశాలపై ప్రజల అభిప్రాయాలు అడిగి తెలుసుకొనేందుకు అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకేలు సోమవారం నుంచి రాష్ట్రంలోని 39 పార్లమెంటు నియోజకవర్గాల్లో పర్యటించనున్నాయి. కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ సంకీర్ణ ప్రభుత్వ కాలం ముగియనున్న నేపథ్యంలో, రానున్న ఏప్రిల్, మే నెలల్లో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ముందస్తు ఏర్పాట్లు చేపట్టింది. అదే విధంగా రాష్ట్రంలో కూడా అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికలకు సిద్ధపడుతున్నాయి. ఈ నేపథ్యంలో, డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ ఉత్తర్వుల మేరకు సోమవారం నుంచి డీఎంకే ఎన్నికల మేనిఫెస్టో తయారీ కమిటీ తూత్తుకుడి నుంచి ప్రజాభిప్రాయ సేకరణకు శ్రీకారం చుట్టనుంది. డీఎంకేకు పోటీగా అన్నాడీఎంకే ఆధ్వర్యంలో ఎన్నికల మేనిఫెస్టోపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఏర్పాటైన కమిటీ అన్ని పార్లమెంటు నియోజకవర్గాల్లో పర్యటించనుంది. ఈ రెండు కమిటీల నిర్వాహకులు జిల్లాలవారీగా ప్రజలను సంప్రదించి వారు ఎదుర్కొంటున్న సమస్యలకు మేనిఫెస్టోలో చోటుచేసుకోనున్నాయి. పార్టీలతో సంబంధం లేని సంఘాల నేతలు, వివిధ సంస్థ నిర్వాహకులను సంప్రదించి అందరూ మెచ్చే విధంగా మేనిఫెస్టో రూపొందించేందుకు సహకరించనున్నాయి. అన్నాడీఎంకే సీనియర్ నేత పొన్నయ్యన్ మీడియాతో మాట్లాడుతూ... ఎన్నికల మేనిఫెస్టోకు సంబంధించి ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేయాలని, రైతులు, ప్రవాస తమిళులు కొరియర్ ద్వారా కానీ, ఈ-మెయిల్ ద్వారా అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయానికి తెలియజేయవచ్చన్నారు. ఈ నెల 10వ తేది వరకు తమకు కేటాయించిన నియోజకవర్గాల్లో పర్యటిస్తామని ఆయన తెలిపారు.

నెలాఖరులోగా కూటమిలో సీట్ల కేటాయింపు

మంత్రుల వెల్లడి

ప్యారీస్, ఫిబ్రవరి 4: డీఎంకే కూటమిలో మిత్రపక్షాలకు సీట్ల కేటాయింపులు ఈ నెలాఖరులోగా ఖరారవతాయని మంత్రులు కేఎన్ నెహ్రూ, పొన్ముడి తెలిపారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో కాంగ్రెస్ 8 చోట్ల గెలిచింది. ప్రస్తుతం కనీసం 10 సీట్లు కేటాయించాలని కాంగ్రెస్ పట్టుబడుతోంది. ఇటీవల సీపీఐ నేతలు తొలివిడత చర్చలు జరిపిన నేపథ్యంలో ఆదివారం సీపీఎం నేతలు సీట్ల కేటాయింపు కమిటీతో భేటీ అయ్యారు.

బొంగరం గుర్తుపైనే పోటీ...

లోక్‌సభ ఎన్నికల్లో ఈసారి తమ పార్టీ చిహ్నమైన బొంగరం గుర్తుపైనే పోటీ చేస్తామని ఎండీఎంకే ఎన్నికల వ్యవహారాల కమిటీ నిర్వాహకులు తెలిపారు. లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని డీఎంకే-ఎండీఎంకే పార్టీల మధ్య సీట్ల సర్దుబాటుకు సంబంధించిన తొలి విడత సమావేశం ఆదివారం ఉదయం తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో జరిగింది. ఈ చర్చల్లో డీఎంకే తరఫున సీనియర్ మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, సెంజి మస్తాన్, ఏవీ వేలు తదితరులు పాల్గొనగా, ఎండీఎంకే ఎన్నికల కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు. సుమారు గంట సేపు సాగిన ఈ సమావేశం అనంతరం ఎండీఎంకే నేతలు మీడియాతో మాట్లాడుతూ... పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి డీఎంకేతో నిర్వహించిన సీట్ల సర్దుబాటు చర్చ సంతృప్తికరంగా సాగిందన్నారు. తమకు రెండు సీట్లు కేటాయించాల్సిందిగా కోరామని తెలిపారు. ఇప్పటివరకు జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో తమ పార్టీ డీఎంకే కూటమి తరఫున ఉదయించే సూర్యుడు గుర్తుపై పోటీ చేసిందని, అయితే ఈసారి బొంగరంపై పోటీ చేయనున్నట్లు ఎండీఎంకే నాయకులు చెప్పారు.

ఈసారి అధిక సీట్లు అడిగాం : సీపీఎం

అన్నా అరివాలయంలో డీఎంకే సీట్ల సర్దుబాటు కమిటీ, సీపీఎం నాయకులు ఆదివారం సమావేశమై చర్చించారు. సీపీఎం తరఫున సంపత్, పి.షణ్ముగం, కనకరాజ్, గుణశేఖరన్, డీఎంకే తరఫున టీఆర్ బాలు, ఆర్.రాజా, పొన్ముడి, పెరియస్వామి తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం సీపీఎం సీనియర్ నేత సంపత్ మీడియాతో మాట్లాడుతూ... గత పార్లమెంటు ఎన్నికల్లో పోటీచేసిన నియోజకవర్గాల కంటే అదనంగా నియోజకవర్గాలు కేటాయించాల్సిందిగా డీఎంకేను కోరామని, తమకు విజయావకాశాలు అధికంగా ఉన్న స్థానాల వివరాలను సమర్పించామని, మలివిడత చర్చలు త్వరలోనే జరుగుతాయన్నారు.



సీట్ల కేటాయింపులపై మిత్రపక్షాలతో చర్చిస్తున్న టీఆర్ బాలు, దురైమురుగన్, పెరియసామి, పొన్ముడి, తిరుచ్చి శివా తదితరులు - చర్చల్లో పాల్గొన్న ఎండీఎంకే నేతలు - సీపీఎం నేతలు

డీఎంకే కూటమిలో మిత్రపక్షాలతో సీట్ల కేటాయింపు చర్చలు చురుగ్గా సాగుతున్నాయి. డీఎంకే కూటమిలో కాంగ్రెస్, డీపీఐ, సీపీఐ, సీపీఎం, ఎండీఎంకే, మనిదనేయ మక్కల్ కట్చి, తమిళగ వాళ్వురిమై కట్చి మిత్రపక్షాలుగా ఉన్నాయి. కాంగ్రెస్ తరఫున ఆ పార్టీ జాతీయ కమిటీ నాయకులు ముకుల్ వాస్నిక్, సల్మాన్ ఖుర్షీద్... డీఎంకే అధిష్ఠానంతో చర్చలు జరిపిన విషయం విదితమే. గత ఎన్నికల్లో 9 సీట్లు పొందిన

కూటమి గెలుపుకోసం శ్రీకృష్ణుడిలా పాటుపడుతున్న స్టాలిన్

● టీఎన్‌సీసీ నేత కేఎస్ అళగిరి



చెన్నై, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే నాయకత్వంలోని సెక్యూలర్ కూటమిని ఆ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కురుక్షేత్రంలో శ్రీకృష్ణుడిలా విజయపథం వైపు నడుపుతున్నారని టీఎన్‌సీసీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి వ్యాఖ్యానించారు. డీఎంకే కూటమి మిత్రపక్షాలు కొన్ని త్వరలోనే అన్నాడీఎంకే కూటమిలో చేరనున్నాయని మాజీమంత్రి డి.జయకుమార్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. తమ కూటమిలో ఏ మిత్రపక్షమూ వెళ్లదని, వాస్తవానికి కొత్త పార్టీలు చేరే అవకాశం ఉందన్నారు. అన్నాడీఎంకేకి ప్రస్తుతం ఎలాంటి లక్ష్యాలు లేవని, ఆత్మగౌరవాన్ని కోల్పోయిందని, అధికారం పోగొట్టుకుందని, మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించిందని, ప్రధాని మోదీకి వత్తాసు పలకడంతో పార్టీ కీర్తి పాతాళానికి చేరిందని అళగిరి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి సంబంధించినంతవరకు దేశంలో ఆర్ఎస్ఎస్ తదితర మత తత్వ శక్తులను తరిమకొట్టడమే ప్రధాన లక్ష్యమని చెప్పారు. సీట్ల కేటాయింపులపై జరిగే చర్చలు కూడా సాఫీగానే సాగుతున్నాయని, ప్రతి పార్టీ మునుపటి కంటే ఎక్కువ సీట్లు కావాలని కోరడం సహజమన్నారు. అయితే ప్రస్తుతం డీఎంకే కూటమికి సంబంధించినంతవరకు మిత్రపక్షాలకు గతంలో కేటాయించిన సీట్ల సంఖ్య ఏ మాత్రం తగ్గదని ఆయన వివరించారు. గత లోక్‌సభ ఎన్నికలలో సెక్యులర్ కూటమి అనే రథాన్ని సమర్థవంతంగా నడిపి విజయాన్ని చేకూర్చిన స్టాలిన్ ఈ ఎన్నికల్లోను కురుక్షేత్రంలో శ్రీకృష్ణుడిలా డీఎంకే కూటమి అనే రథాన్ని నడిపి అన్ని సీట్లలో గెలిపిస్తారనే నమ్మకం తనకుందని చెప్పారు. మునుపటి యూపీఏ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మైనార్టీలకు తక్కువ అవకాశాలు కల్పించారని బీజేపీ నేత అన్నామలై ఆరోపించడం గర్హనీయమని చెప్పారు. వాస్తవానికి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాకే మైనార్టీలకు ఉద్యోగవకాశాలు బాగా తగ్గిపోయాయని అళగిరి పేర్కొన్నారు.

బడ్జెట్ తయారీపై అధికారులతో సీఎం చర్చలు

చెన్నై, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వార్షిక బడ్జెట్ తయారీపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ స్పెయిన్ రాజధాని మాడ్రిడ్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్థిక విభాగం అధికారులతో చర్చించారు. ఈ నెల 12న శాసనసభ సమావేశాలు ప్రారంభమవుతున్నాయి. ఈ సమావేశాల్లోనే 19న వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు ప్రవేశ పెట్టనున్నారు. ఏప్రిల్ లేదా మేలో లోక్‌సభ ఎన్నికలు జరగనుండటంతో ఈ బడ్జెట్‌లో ప్రజాకర్షణ పథకాలకు సంబంధించిన ప్రకటనలు కూడా వెలువడే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలోనే స్టాలిన్ ఆదివారం మధ్యాహ్నం అధికారులతో బడ్జెట్‌లో చేర్చాల్సిన కీలకమైన అంశాలపై చర్చలు జరిపారు. ఆర్థికశాఖకు చెందిన ఉన్నతాధికారులు ఈ చర్చల్లో పాల్గొన్నారు. ఆరేళ్లలో రాష్ట్రాన్ని వన్ ట్రిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థిక పురోగమన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని స్టాలిన్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ దిశగానే బడ్జెట్‌లో రాష్ట్రానికి దీర్ఘకాలిక ప్రయోజనాలు కల్పించే అంశాలు కూడా ఉండాలని స్టాలిన్ సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామికపరంగా వెనుబడిన జిల్లాల్లో కొత్త పారిశ్రామికవాడలను ఏర్పాటు చేయాలని కూడా ఆయన భావిస్తున్నారు. ఈ విషయమై కూడా బడ్జెట్‌లో ప్రకటనలు వెలువడే అవకాశాలు ఉన్నాయి.



స్పెయిన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్థిక విభాగ అధికారులతో చర్చిస్తున్న సీఎం స్టాలిన్

కనులపండువగా భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణం

ప్యారీస్, ఫిబ్రవరి 4: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా శ్రీశైలం దేవస్థానం, కుచలాంబాల్ చారిటీస్ సంయుక్త ఆధ్వర్యంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం కనులపండువగా సాగింది. లోక కల్యాణార్థం ఆదివారం సాయంత్రం స్థానిక చెట్‌పెట్‌లోని కుచలాంబాల్ కల్యాణ మండపం వేదికగా కల్యాణోత్సవాన్ని శ్రీశైలం దేవస్థానం ప్రధాన అర్చకుడు ఎం.శివశంకరయ్య, అమ్మవారి ఆలయం ఉప ప్రధాన అర్చకుడు ఎం.సత్యనారాయణ శర్మ నేతృత్వంలో కమనీయంగా కల్యాణ క్రతువు సాగింది. మామిడి తోరణాలు, పూలు, పండ్లతో అలంకరించిన వేదికపై భ్రమరాంబికదేవి, మల్లికార్జునస్వామి వార్ల కల్యాణ మూర్తుల విగ్రహాలు కొలువుదీర్చి సన్నాయి వాయిద్యాలు, వేదమంత్రోచ్చరణలు, భక్తుల శివనామస్మరణల మధ్య కల్యాణ తంతు జరిగింది. ఈ కల్యాణ వైభవంలో కుచలాంబాల్ చారిటీస్ అధ్యక్షుడు కె.సుబ్రమణ్య మోహన్, ఆయన కుమారుడు కార్తీక్, కుటుంబసభ్యులు, మేనేజర్ రమేష్, టీటీడీ చెన్నై సలహా మండలి ఉపాధ్యక్షుడు కె.ఆనంద్‌కుమార్‌రెడ్డి, కమిటీ సభ్యులు వీవీఆర్ కృష్ణారావు, బి.మోహనరావు, డి.రాధాకృష్ణమూర్తి, కె.రంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, కన్నియాకుమారి వివేకానంద కేంద్ర నిర్వాహకులు వి.బాలకృష్ణన్, తెలుగు ప్రముఖులు గోటేటి వెంకటేశ్వరరావు, ఎ.రమేష్, శ్రీశైలం ఆలయ ఇన్‌చార్జి డి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా అర్చకులు గణపతి పూజ, మహాసంకల్పం, అక్షతారోపణం, వేద ఆశీర్వచనాలతో స్వామి, అమ్మవారి కల్యాణ మహోత్సవం కనుల పండువగా చేశారు. నగరంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని కనులారా తిలకించి తరించారు. దాదాపు రెండు గంటల పాటు ఈ కల్యాణ వేడుకలు భక్తులను భక్తిపారవశ్యంతో నింపింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు ప్రసాదాలతో పాటు శ్రీశైలం దేవస్థానం నుంచి తీసుకొచ్చిన ప్రసాదాలను అందజేశారు.



సర్వాలంకరణ శోభతో కనువిందు చేస్తున్న భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి



ఉత్సవానికి విచ్చేసిన భక్తులు, నగర ప్రముఖులు



కల్యాణోత్సవంలో నిర్వాహకులు, టీటీడీ స్థానిక సలహామండలి సభ్యులు




ఊటీలో జరిగిన యువమోర్చా సమావేశంలో ప్రసంగిస్తున్న మురుగన్

త్వరలో నామ్ తమిళర్ కట్చి నేతల అరెస్టు

● కేంద్రమంత్రి మురుగన్

చెన్నై, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే) నేతలు విదేశాల్లోని నిషేధిత ఉగ్రవాద సంస్థల నుంచి నిధులు పొంది, దేశంలో విద్రోహక చర్యలు పాల్పడుతున్నట్లు ఆధారాలు లభించాయని, త్వరలో ఆ నేతలంతా అరెస్టు కావడం తథ్యమని కేంద్ర మత్స్యశాఖ మంత్రి ఎల్ మురుగన్ చెప్పారు. రెండు రోజులకు ముందు జాతీయ దర్యాప్తు బృందం (ఎన్ఐఏ) అధికారులు ఎన్‌టీకే నేతల గృహాల్లో తనిఖీలు చేసి కీలకమైన దస్తావేజులు స్వాధీనం చేసుకున్నారు. తిరుచ్చిలోని పార్టీ ప్రచార కార్యదర్శి యూట్యూబర్ దురైమురుగన్ నివాసగృహం, కోయంబత్తూరులోని పార్టీ సాంకేతిక విభాగం మాజీ నేత రంజిత్‌కుమార్, మరో నేత ఇసై మదివానన్, జిల్లా సాంకేతిక విభాగం కార్యదర్శి విష్ణుప్రతాప్, కొళత్తూరుకు చెందిన బాలాజీ ఇళ్లలో సుమారు 150 మంది ఎన్ఐఏ అధికారులు తనిఖీలు నిర్వహించి, దస్తావేజులు స్వాధీనం చేసుకుని విచారణకు హాజరుకావాలంటూ సమన్లు కూడా జారీ చేసిన విషయం తెలిసింది. ఈ విషయంపై మంత్రి ఎల్ మురుగన్ కోయంబత్తూరులో ఆదివారం ఉదయం మీడియాతో మాట్లాడుతూ... గత కొన్నేళ్లుగా ఎన్‌టీకే నేతల కార్యక్రమాలన్నీ శ్రీలంకలో మృతి చెందిన తీవ్రవాద సంస్థల నేతలకు భారీ ఎత్తున నివాళి అర్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించి రాష్ట్రంలో ఆ సంస్థలను ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. ఎన్‌టీకే నేతలు శ్రీలంకలోని నిషేధిత ఎల్టీటీఈ సంస్థ నుంచి, విదేశాల్లోని మరికొన్ని ఉగ్రవాద సంస్థల నుంచి నిధులు పొందినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో ఆధారాలు లభించాయని చెప్పారు. దేశంలో ఉగ్రవాదం, దేశ సమగ్రతకు భంగం కలిగించే ఎన్‌టీకే వంటి రాజకీయ పార్టీలపై ఎన్ఐఏ అధికారులు గత కొంత కాలంగా తీవ్ర నిఘా వేశారని చెప్పారు. ఎన్ఐఏ అధికారులు తగిన ఆధారాలతో తనిఖీలు చేస్తే, తమ పార్టీని బెదిరించేందుకే తనిఖీలు జరుపుతున్నారంటూ ఎన్‌టీకే అధినేత సీమాన్ విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. తప్పు చేసినవారంతా తమను బెదిరించటానికే దాడులు జరుపుతున్నారంటూ ఆరోపించడం ఫ్యాషనై పోయిందన్నారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల వ్యూహరచన చేయడానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వస్తున్నారని ఆయన చెప్పారు. కోయంబత్తూరు నియోజకవర్గంలో పార్టీ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు అన్నామలై పోటీ చేస్తే తాను ఆయన తరఫున తీవ్ర ప్రచారం సాగించడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీకి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోందని, లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసినా, ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకున్నా పార్టీ ఘనవిజయం సాధిస్తుందని చెప్పారు.

వెల్లుల్లి కిలో రూ.500!



ప్యారీస్, ఫిబ్రవరి 4: స్థానిక కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్‌కు దిగుబడి తగ్గిన కారణంగా కిలో వెల్లుల్లి ధర రూ.500కు పెరిగింది. అందువల్ల గృహిణులు, వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశంలో ఇదివరకు ఎన్నడూ లేని విధంగా అన్ని రాష్ట్రాల్లో వెల్లుల్లి ధరకు రెక్కలొచ్చాయి. గత నెల వరకు కిలో వెల్లుల్లి రూ.100కు విక్రయించగా, ప్రస్తుతం ఒక్కసారిగా రూ.500లకు పెరిగింది. కరువు, వరదలు, భారీవర్షాల కారణంగా వెల్లుల్లి దిగుబడి బాగా తగ్గిందని, నగరానికి తరలిస్తున్న వెల్లుల్లి లోడు బాగా తగ్గిపోవడంతో పెరిగిన ధర ఈ నెలాఖరు వరకు కొనసాగే అవకాశముందని కోయంబేడు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఢిల్లీ వెళ్లిన గవర్నర్



పెరంబూర్, ఫిబ్రవరి 4: రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి మూడు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం ఉదయం 11 గంటలకు విమానంలో ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. ఢిల్లీలో ఆయన కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీకానున్నారు. రాష్ట్ర శాసనసభలో ఆమోదించిన బిల్లులకు ఇంకా ఆమోదం తెలపకపోవడం వల్ల ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఆయనకు మధ్య అభిప్రాయబేధాలు కొనసాగుతుండటం, శాసనసభ సమావేశాలు ఈనెల 12న ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆకస్మికంగా ఢిల్లీకి బయలుదేరి వెళ్లడం కలకలం సృష్టిస్తోంది. శాసనసభ సమావేశాలు గవర్నర్ రవి ప్రసంగంతో ప్రారంభం కానున్నాయి. గతేడాది ప్రసంగ పాఠంలో మార్పులు చేసి పఠించిన గవర్నర్‌కు చేదు అనుభవం ఎదురైన విషయం తెలిసింది. ఆ సమావేశంలో ప్రభుత్వం రూపొందించిన ప్రసంగాన్ని ఎలాంటి మార్పులు లేకుండా సభలో ముఖ్యమంత్రి ఆమోదింప జేయడంతో, గవర్నర్ అర్థంతరంగా సభ నుంచి నిష్క్రమించారు. మళ్లీ అలాంటి పరిస్థితులు రాకుండా ఉండేలా శాసనసభలో ఈసారి గవర్నర్ హుందాగా నడచుకుంటారని తెలుస్తోంది. అదే సమయంలో ప్రభుత్వ బిల్లుల ఆమోదం గురించి కేంద్రమంత్రి అమిత్‌షా అభిప్రాయాలను అడిగి తెలుసుకోనున్నారు. ఢిల్లీలో మూడు రోజులు బస చేయనున్న గవర్నర్ మరి కొందరు మంత్రులను కూడా కలుసుకుంటారని తెలుస్తోంది. ఢిల్లీ పర్యటనను ముగించుకుని మంగళవారం రాత్రి ఏడు గంటలకు ఆయన నగరానికి బయలుదేరి రానున్నారు.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 4: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దిగువ తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఈబీ తెలిపింది.

తాంబరం: సెంబాక్కం సుదర్శన్ నగర్, వీజీపీ శరవణన్ నగర్, శ్రీదేవి నగర్, కరుమారియమ్మన్ నగర్, మాడంబాక్కం, వేంగైవాసల్ మెయిన్ రోడ్డు, వేంబులి అమ్మన్ ఆలయ వీధి, పునిదవతి కాలని, ఈవీఆర్ వీధి, అంబికా నగర్, గాయత్రి గార్డెన్. **అడయార్:** బిసెంట్ నగర్ ఎంజీఆర్ రోడ్డు, శాస్త్రి నగర్. **ఎన్నూర్:** కత్తివాక్కం, ఎన్నూర్ బజార్, కాట్టుకుప్పం, నెహ్రూ నగర్, శాస్త్రి నగర్, అన్నానగర్, శివన్‌పడై వీధి, వళ్లువర్ నగర్, కామరాజర్ నగర్, ఎస్‌ఈఎం నగర్, వాహూసీ నగర్, ఉలగనాథపురం, ముఖద్వారకుప్పం, ఎన్నూర్‌కుప్పం, తాలాంకుప్పం, నెట్టుకుప్పం, చిన్నకుప్పం, పెరియకుప్పం, ఎర్నావూర్‌కుప్పం, ఈటీపీఎస్ బోర్డ్ కాలని, ఎర్నావూర్, జ్యోతి నగర్, రామనాథపురం, శక్తిగణపతి నగర్, షణ్ముగా పురం.

12న గ్రూప్-2 ఇంటర్వ్యూలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 4: గ్రూప్-2 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు ఈనెల 12వ తేది జరగనున్నాయని టీఎన్‌పీఎస్సీ తెలిపింది. గ్రూప్-2, గ్రూప్-2ఏ విభాగాల్లో 6,151 ఖాళీ పోస్టుల భర్తీకి ప్రిలిమినరీ పరీక్షలు 2022 మే 21వ తేది నిర్వహించగా, 9 లక్షల మంది హాజరయ్యారు. ఈ పరీక్షా ఫలితాలు అదే సంవత్సరం నవంబరులో విడుదల కాగా, 51,987 మంది మెయిన్ పరీక్షకు అర్హత పొందారు. వారికి గత ఏడాది ఫిబ్రవరి 25వ తేది నిర్వహించిన పరీక్షా ఫలితాలు జనవరిలో విడుదలయ్యాయి. 161 ఇంటర్వ్యూ పదవులకు 483 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరగ్గా, 12 నుంచి 17వ తేది వరకు ఇంటర్వ్యూలు, 21వ తేది ఉద్యోగ నియామక కౌన్సెలింగ్ జరుగుతుందని అధికారులు తెలిపారు.

క్రెడిట్ కార్డులతో మెట్రో టిక్కెట్లు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 4: క్రెడిట్, డెబిట్ కార్డులు ఉపయోగించి టిక్కెట్ పొందే సౌకర్యం కల్పించినట్లు చెన్నై మెట్రోరైలు సంస్థ అధికారులు తెలిపారు. మెట్రో ప్రయాణికులకు వివిధ వసతులను సీఎంఆర్‌ఎల్ కల్పిస్తోంది. మినీ బస్సులు, షేర్ ఆటోలు, బ్యాటరీ ఆటోలు వంటి సేవలు అందుబాటులో ఉన్నాయి. రైల్వేస్టేషన్లలో టిక్కెట్టు పొందేందుకు క్యూలో వేచి ఉండడాన్ని అడ్డుకొనేలా వివిధ పథకాలు ప్రవేశపెడుతున్నారు. ఇందులో భాగంగా క్రెడిట్, డెబిట్ కార్డులు, జీపీఎస్ స్కానర్ ఉపయోగించి డిజిటల్ టిక్కెట్టు పొందే సౌకర్యం పరిచయం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

తగ్గిన పూల ధరలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 4: పండుగలు, శుభముహూర్తాలు లేకపోవడంతో స్థానిక కోయంబేడు మార్కెట్లో పూల ధరలు తగ్గాయి. ఇటీవల కిలో మల్లెలు రూ.2,400లకు విక్రయంకాగా, ప్రస్తుతం రూ.1,800, రూ.1,800లకు విక్రయమైన ఐస్ మల్లెలు రూ.1,500, రూ.800 విక్రయమైన జాజి మల్లె రూ.400, రూ.700కు విక్రయమైన కనకాంబరాలు రూ.300, రూ.300కు విక్రయమైన గన్నేరు పూలు రూ.100, రూ.50కు విక్రయమైన చామంతి రూ.20, రూ.80కి విక్రయమైన పన్నీర్ రోజ్ రూ.20, రూ.50కి విక్రయమైన సంపంగి రూ.15తో పాటు అన్నిరకాల పూల ధరలు తగ్గాయి.

చదురగిరికి భక్తుల అనుమతి

పెరంబూర్, ఫిబ్రవరి 4: పశ్చిమ కనుమల కొండ ప్రాంతంలో చదురగిరి సుందర మహాలింగం ఆలయానికి తైమాసం అమావాస్య సందర్భంగా ఈనెల 7 నుంచి 10వ తేది వరకు నాలుగు రోజులు భక్తులను అనుమతిస్తున్నట్లు అటవీ శాఖ, ఆలయ అధికారులు చెప్పారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతిస్తామని, భక్తులు ఆలయానికి కొండ మార్గం ద్వారా మాత్రమే వెళ్లాలని, రాత్రి వేళల్లో బస చేసేందుకు అంగీకరించమని పేర్కొన్నారు. కొండ ప్రాంతాల్లోని జలపాతాల్లో ప్రజలు స్నానాలు చేయరాదని అటవీ శాఖ సూచించింది.

200 ఎంటీసీ బస్సుల్లో ఆటోమేటిక్ డోర్లు

పెరంబూర్, ఫిబ్రవరి 4: నగరంలో నడుపుతున్న 200 ప్రభుత్వ బస్సులకు ఆటోమేటిక్ డోర్లు ఏర్పాటు కానున్నాయి. విద్యార్థులు, ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ చర్యలు చేపట్టినట్లు మెట్రోపాలిటన్ రవాణా సంస్థ తెలిపింది. అలాగే, బస్సు డ్రైవర్లు, కండక్టర్లు చేపట్టాల్సిన భద్రతా చర్యలను ఎంటీసీ పేర్కొనింది.

- విద్యార్థుల ఫుట్ బోర్డు ప్రయాణం అడ్డుకోవాలి
- బస్సు ముందు, వెనుక భాగాల్లోని కిటికీలు పట్టుకొని విద్యార్థులు ప్రయాణించడాన్ని అడ్డుకొనేలా వాటిని శాశ్వతంగా మూసివేయాలి. ● ఫుట్ బోర్డు ప్రయాణం నేరమని విద్యార్థులకు అవగాహన కల్పించాలి. అయినా వారు వినకుండా ఫుట్ బోర్డుపై ప్రయాణిస్తే సమీపంలోని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. ● తర్వాత వచ్చే బస్టాప్ పేరును కండక్టర్ ముందుగానే తెలియజేసి ప్రయాణికులను అప్రమత్తం చేయాలి. ● ప్రయాణికులు దిగి, ఎక్కిన తర్వాతే బస్సు బయల్దేరేలా కండక్టర్లు చూసుకోవాలి.● బస్సు డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులతో సఖ్యతగా మెలగాలి.

రూ.26 లక్షలతో సిమెంటు రోడ్లు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 4: స్థానిక పల్లావరంలో రూ.26 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పల్లావరం శాసనసభ నియోజకవర్గ పరిధికి చెందిన ఈశ్వరినగర్, కుళత్తూర్‌మేడు ప్రాంతాల్లో రోడ్డు సదుపాయం లేకపోవడంతో వాహనచోదకులు, స్థానికులు రోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యే కరుణానిధిని కోరారు. వారి కోరిక మేరకు రూ.26 లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణపనులు ప్రారంభించారు.

క్రైస్తవుల సమాధి విధానంలో మార్పులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 4: నగర ప్రాంతాల్లో ఉన్న క్రైస్తవుల శ్మశానవాటికల్లో మృతదేహాలు ఖననం చేసే విధానాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. క్రైస్తవ కుటుంబీకులు ఒక సమాధి రిజిస్టర్ చేయించుకొంటే అదే కుటుంబసభ్యులు మరణించినప్పుడు 14 ఏళ్ల అనంతరం ఆ సమాధిలోనే ఖననం చెయ్యొచ్చు. పిల్లలైన నేపథ్యంలో, 12 ఏళ్ల వరకు ఈ పరిమితి ఉంటుంది. ఈ విధానాలతో శ్మశానాల్లో స్థలం దొరకలేని పరిస్థితి నెలకొంది. తమకు ప్రత్యేక స్థలం కేటాయించాలని క్రైస్తవ సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయి. మున్సిపాలిటీలకు చెన్నై కార్పొరేషన్ చేసిన సిఫారసుల మేరకు సమాధి విధానాల్లో మార్పులు జరిగాయి. ఆ ప్రకారం, ● సమాధిలో మళ్లీ ఒక మృతదేహాన్ని ఖననం చేయడానికి శవపేటిక లేకుండా పూడ్చిపెట్టిన స్థలంలో 12 నెలల అనంతరం మరొకరి మృతదేహాన్ని ఖననం చేయవచ్చు. ● కొయ్యతో చేసిన శవపేటికలో ఉంచిన మృతదేహాన్ని ఖననం చేసిన స్థలంలో 18 నెలల అనంతరం అదే కుటుంబానికి చెందిన వేరొకరి మృతదేహాన్ని పూడ్చిపెట్టొచ్చు. ● లోహంతో తయారుచేసిన శవపేటిలో పూడ్చిపెట్టిన స్థలంలో ఏడేళ్ల అనంతరం అదే కుటుంబంలో ఒక మృతదేహాన్ని ఉంచొచ్చు. ● స్థానిక కీల్పాక్కంలో ఉన్న శ్మశానంలో ఉన్నట్లే మృతదేహాలను పేర్చి పెట్టే బాక్సుల్లో ఉంచేందుకు అనుమతి కల్పించారు ఈ కొత్త విధానాలు రాష్ట్రంలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పట్టణ పంచాయతీల్లో ఉన్న క్రైస్తవ శ్మశాన వాటికలకు వర్తిస్తాయని మున్సిపాలిటీల నిర్వహణ శాఖ కార్యదర్శి కార్తికేయన్ తెలిపారు.

రామేశ్వరం జాలర్లపై లంకనావికా దళం దాడి

● 23 మంది జాలర్ల అరెస్టు


అరెస్టయిన జాలర్లు

చెన్నై, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తమ దేశ సముద్ర జలాల్లో అక్రమంగా చొరబడ్డారంటూ రామేశ్వరం జాలర్లపై శ్రీలంక నావికాదళం విరుచుకుపడింది. రెండు పడవల్లో ఉన్న 23 మంది జాలర్లను నిర్బంధించి తరలించింది. ఈ సంఘటన పై రామేశ్వరంలోని జాలర్ల సంఘాల నాయకులకు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రామనాథపురం జిల్లా రామేశ్వరం నుంచి శనివారం ఉదయం 492 మర పడవల్లో సుమారు 3,500 మంది జాలర్లు సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. అర్ధరాత్రి కచ్చాదీవి, నెడుదీవికి నడుమ ఉన్న సముద్రంలో వీరంతా వలలు విసిరారు. ఆ సమయంలో ఐదు గస్తీ నౌకల్లో వచ్చిన శ్రీలంక నావికాదళం సభ్యులు జాలర్లను చుట్టుముట్టారు. దీనితో భీతిల్లిన పలువురు జాలర్లు ప్రాణభయంతో వలను విడిచిపెట్టి తీరంవైపు పారిపోయారు. అదే సమయంలో శ్రీలంక నావికాదళం సభ్యులు రెండు పడవలను చుట్టుముట్టి ఆ పడవల్లో ఉన్న జాలర్లపై దాడి జరిపారు. రామేశ్వరం తంగచ్చిమఠానికి చెందిన జేమ్‌సన్‌కు చెందిన ఆ పడవలో ఉన్న జాలర్లు వెంగర్, మార్టిన్, మణి, చిదంబరం, ఆరోన్, సతీష్, సుభాష్ చంద్రబోస్, సుధాకర్, జెరాల్డ్, కమూల్, అంగును నిర్బంధించారు. ఇదేవిధంగా సహాయ్‌రాజ్‌కు చెందిన పడవలో ఉన్న రాబర్ట్, జాక్సన్, సాముయేల్, మెల్సన్, లెనిన్, గోవా, రంజిత్, అశోంత్, లవ్‌సన్, లిస్టన్, ఇళంగో సహా 23 మంది జాలర్లను నిర్బంధించారు. వీరిని శ్రీలంకలోని కాంగేశన్ ఓడరేవుకు తీసుకెళ్ళారు. అక్కడి నావికాదళం అధికారులు విచారణ జరిపి జాలర్లు తమ దేశ సముద్ర జలాల్లోకి అక్రమంగా ప్రవేశించారంటూ జైలుకు తరలించారు. ఈ సంఘటనపై రామేశ్వరం జాలర్ల సంఘం నాయకులు సముద్రతీర భద్రతా దళం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నారు... నీరు పెట్టకుండా వరి పంట

రాలిన వడ్లగింజలే మొలకెత్తిన వైనం ● ఎకరాకు 8 బస్తాల దిగుబడి ● విస్తుపోయిన రైతన్న

ఐసిఎఫ్, ఫిబ్రవరి 4: తంజావూరు జిల్లా పట్టుకోట సమీపంలో నారు నాటకుండా, నీరు పోయకుండా రెండు ఎకరాల్లో ఏపుగా పెరిగిన వరి పంటను చూసి స్థానికులే కాకుండా రైతు కూడా విస్తుపోయారు. గతంలో పంట నూర్పిడి సందర్భంగా రాలిన గింజలే మొకెత్తి ఆ రైతన్నకు 16 బస్తాల వరి దిగబడి ఇచ్చింది. పట్టుకోట సమీపంలో ఉన్న ఆంబలాపత్తు దక్షిణ గ్రామానికి చెందిన జయరాజ్ (52)కు సొంతమైన రెండు ఎకరాల భూమిలో ఆర్నెల్ల క్రితం కురువై వరి సాగు చేసి, ఎకరాలకు రూ.50 వేలు ఖర్చు చేశాడు. కోత సమయానికి ఆశించిన మేరకు దిగుబడులు లభించలేదు. దీంతో మళ్లీ సాగు చేయకుండా భూమిని బీడుగా ఉంచారు. ఈ నేపథ్యంలో, ఆ పొలం వైపు వెళ్లి కొందరు, రెండు రోజుల క్రితం జయరాజ్‌ను సంప్రదించి పొలంలో పంట కోతకు సిద్ధంగా ఉందని చెప్పారు. దిగ్భ్రాంతి చెందిన జయరాజ్ తనను ఆటపట్టిస్తున్నారని తొలుత భావించారు. ఆ తర్వాత పొలానికి వెళ్లిచూడగా స్థానికులు చెప్పినట్లు పంట చేతికి వచ్చింది. వెంటనే కూలీలతో కోతపనులు ప్రారంభించాడు. రెండు ఎకరాల్లో మొత్తం 16 బస్తాల వడ్లు లభించాయి. ఈ విషయమై జయరాజ్ మాట్లాడుతూ... గతంలో వరి సాగు చేసినప్పుడు దిగుబడులు లేక నష్టం వాటిల్లిందని, గత నాలుగు నెలలుగా పొలానికి వెళ్లడం మానుకున్నానని, ఈ పరిస్థితుల్లో గతంలో పంట నూర్పిడి సందర్భంగా తన నేలలో రాలిన గింజలే ఏపుగా పెరిగి పంట చేతికి రావడం తనకు సంతోషాన్ని కలిగించిందన్నారు.

262 పడకలతో ఆసుపత్రి

ఐసిఎఫ్, ఫిబ్రవరి 4: స్థానిక పెరుంబాక్కం కాలేజీ రోడ్డులో 262 పడకలతో ఆసుపత్రి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో రూ.51 కోట్లతో ఆరు అంతస్తులతో నిర్మిస్తున్న ఈ భవనంలో శస్త్ర చికిత్స, అత్యవసర విభాగం, డయాలసిస్ వంటి విభాగాలు ఏర్పాటు కానున్నాయి. అలాగే, ల్యాబొరేటరీ, ఎక్స్‌రే, స్కాన్, మందుల స్టోర్ రూం, కార్యాలయం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు. మరో ఆరు నెలల్లో ఈ పనులు పూర్తవుతాయని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

అమ్మవారి విగ్రహంలో తెరచుకున్న నేత్రాలు?


ఆలయంలోని మారియమ్మన్ విగ్రహం

చెన్నై, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ మూలపట్టరై సమీపంలోని గాంధీపురం మిల్లువీధిలోని ఎల్లై మారియమ్మన్ ఆలయంలో శనివారం సాయంత్రం అమ్మవారి విగ్రహంలోని నేత్రాలు తెరచి మూసినట్లు కొంత మంది భక్తులకు కనిపించడంతో ఆ ప్రాంతం ఉన్నట్టుండి జనంతో నిండిపోయింది. తొలుత ఓ బాలిక అమ్మవారి విగ్రహం ఎదుట నిలిచి ప్రార్థిస్తుండగా అమ్మవారి విగ్రహంలోని నేత్రాలు తెరచి మూసుకున్నట్లు అగుపడింది. దీంతో పారవశ్యం చెందిన బాలిక పూనకం వచ్చినట్లు ఊగిపోయింది. అదే సమయంలో మరికొంతమంది భక్తులు చూసినప్పుడు కూడా అమ్మవారి నేత్రాలు క్షణాలపాటు తెరచి మూసుకున్నాయి. దీనితో ఆ భక్తులంతా అమ్మవారు కళ్లు తెరిచారంటూ బిగ్గరగా కేకలు వేసారు. ఆ తర్వాత ఈ విషయం గ్రామమంతటా దావానలంలా వ్యాపించడంతో ప్రజలంతా అమ్మవారిని దర్శించేందుకు బారులు తీరారు. ఆదివారం వేకువజాము వరకూ భక్తులు ఆ ఆలయం వద్ద అమ్మవారిని భక్తులు క్యూలైన్లలో నిలిచి దర్శనం చేసుకున్నారు.

కిలంబాక్కంలో రూ.14.30 కోట్లతో కొత్త పోలీస్ స్టేషన్

పెరంబూర్, ఫిబ్రవరి 4: స్థానిక వండలూరు సమీపంలోని కిలంబాక్కం వద్ద నూతనంగా నిర్మించిన బస్ టెర్మినల్‌ను గత డిసెంబరు 30వ తేది ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో, కిలంబాక్కంలో కొత్త పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు రూ.6.55 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ స్టేషన్‌లో ఇద్దరు సీఐలు, ఆరుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసులు అని మొత్తం 71 మందిని నియమించడంతో పాటు రెండు జీపులు, 7 మోటరు సైకిళ్లు అందజేయనున్నారు. అలాగే, కుర్చీలు, బల్లలు తదితర వస్తువుల కొనుగోలుకు రూ.3,27,800, స్కానర్, వాకీటాకీ, వైర్‌లెస్, ఎలక్ట్రానిక్ పరికరాల కొనుగోలుకు రూ.5,80,000 కేటాయించారు. ప్రస్తుతం తాలూకా పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలోనే కిలంబాక్కం పోలీస్‌స్టేషన్ పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో, ఈ బస్టాండ్ ముందు భాగంలో పోలీస్‌స్టేషన్ నిర్మాణాలకు 5వ తేది మంత్రులు టీఎం అన్బరసన్, పీకే శేఖర్‌బాబు భూమి పూజ చేస్తారని అధికారులు తెలిపారు.

19న టిటో జాక్ సమాఖ్య నిరాహారదీక్ష

ప్యారీస్, ఫిబ్రవరి 4: వేతనం పెంపు, పాత పింఛన్ విధానం అమలు, సమాన పనికి సమాన వేతనం తదితర కోర్కెలు ముందుంచి ఈనెల 19న నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తమిళనాడు ప్రాథమిక విద్య టీచర్ల సంఘాల సమాఖ్య (టిటో-జాక్) ప్రకటించింది. నగరంలో ఆదివారం ఉదయం టిటో-జాక్ రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఇందులో పది తీర్మానాలను ఆమోదించారు. కేంద్రప్రభుత్వానికి దీటుగా రాష్ట్రప్రభుత్వం వేతనం ప్రకటించాలని, అక్టోబరు 12న పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్‌తో జరిగిన సమావేశంలో అంగీకరించిన డిమాండ్లను పరిష్కరించాలని, పదోన్నతికి భంగం కలిగించేలా జారీ చేసిన 243వ జీవో రద్దు తదితర డిమాండ్లతో నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ఆ సంఘం తెలిపింది.

13న టీఎన్‌ఈబీ కార్యాలయాల ఎదుట ధర్నా

ప్యారీస్, ఫిబ్రవరి 4: రాష్ట్ర విద్యుత్ బోర్డులో పనిచేస్తున్న ఉద్యోగుల తరపున ఈనెల 13న పలు డిమాండ్లతో ధర్నా చేపట్టనున్నట్లు సీఐటీయూ, ఏఐటీయూసీ సంస్థలు ప్రకటించాయి. ఇటీవల జరిగిన విద్యుత్ బోర్డు కార్మికుల సంఘాల సమాఖ్య సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించి ఆ వివరాల నివేదికను రాష్ట్రప్రభుత్వానికి సమర్పించారు. అయితే ఇప్పటివరకు దీనిపై చర్యలు లేకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టీఎన్‌ఈబీ జోనల్ కార్యాలయాల ముందు ధర్నా చేపట్టనున్నట్లు ప్రకటించాయి. అదే విధంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 16న నిర్వహించన్ను భారత్ బంద్‌కు మద్దతిస్తున్నట్లు ఆ సంఘాలు తెలిపాయి.

పబ్జీ గేమ్ ఆడొద్దన్న తల్లిదండ్రులు

● ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి

అడయార్, ఫిబ్రవరి 4: స్థానిక కోడంబాక్కం లింగేశ్వరర్ నగర్‌లో ఓ విషాదకర ఘటన జరిగింది. నిత్యం పబ్జీగేమ్ ఆడుతూ మొబైల్‌కు బానిసగా మారిన ఓ విద్యార్థిని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడిని ప్రవీణ్ (20)గా గుర్తించారు. నగరంలోని ఒక ప్రైవేటు కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యాభ్యాసం చేస్తున్నాడు. శనివారం జరిగిన ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని శవపరీక్ష కోసం ఆస్పత్రికి తరలించారు.

మూడు మేకలను మింగేసిన కొండ చిలువ

అడయార్, ఫిబ్రవరి 4: మదురై జిల్లా ఉసిలంపట్టి సమీపంలో ఒక కొండ చిలువ ఏకంగా మూడు మేకలను మింగేసింది. ఈ కొండ చిలువను చూసిన స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఉసిలంపట్టి సమీపంలోని గోపాలపురానికి చెందిన మురుగన్ అనే వ్యక్తి తన మేకలను శనివారం పశ్చిమ కొండలకు సమీపంలో మేత కోసం తోలుకెళ్లాడు. ఆ సమయంలో మేకలన్నీ ఒక్కసారి బిగ్గరగా శబ్దం చేయడాన్ని గమనించిన మురుగన్.. వాటి సమీపానికి వెళ్ళి చూడగా, 10 అడుగుల కొండ చిలువ అప్పటికే రెండు మేకలను మింగినట్లు గుర్తించాడు. ఆ వెంటనే ఆయన స్థానిక అటవీ శాఖ అధికారులకు సమాచారం చేరవేయగా, వారు వచ్చేలోపు మరో మేకను కొండ చిలువ మింగి, అటవీ శాఖ అధికారులు వచ్చే సమయానికి జారుకుంది.

ల్యాబ్ అసిస్టెంట్లకు వేరే పనులు ఇవ్వకండి

ఐసిఎఫ్, ఫిబ్రవరి 4: ల్యాబ్ అసిస్టెంట్‌లకు వేరే పనులు ఇవ్వరాదని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కుమర గురుపరన్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఉన్నత, మహోన్నత పాఠశాలల్లో 6 నుంచి ప్లస్‌టూ వరకు చదివే విద్యార్థుల విద్యా నైపుణ్యం పెంచేందుకు టెక్నికల్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్, వృత్తి విద్యా ల్యాబ్‌లు, భాషా పరిశోధనశాలలు ఏర్పాటు చేశారు. వీటిలో అసిస్టెంట్లను నియమించి ల్యాబ్ పనులు చేపడుతున్నారు. ఈ ఉద్యోగులకు ఇతర పనులకు పురమాయించరాదని పాఠశాలల హెచ్‌ఎంలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

విద్యుత్ బోర్డుకు రూ.లక్ష జరిమానా

ఐసిఎఫ్, ఫిబ్రవరి 4: బూడిద వ్యర్థాలు తొలగించడంలో జాప్యం చేసిన విద్యుత్ బోర్డుకు దక్షిణ మండల గ్రీన్ ట్రిబ్యునల్ రూ.లక్ష జరిమానా విధించింది. తిరువళ్లూర్ జిల్లా అత్తిపట్టులో ఉన్న ఉత్తర చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రం నుంచి విడుదలయ్యే నేలబొగ్గు బూడిద వ్యర్థాలు బకింగ్‌హామ్ కాలువ, కుశస్థలి నదుల్లో పారబోస్తున్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఈ బూడిద తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ చెన్నైకి చెందిన రవిమారన్ దక్షిణ మండల గ్రీన్ ట్రిబ్యునల్‌లో పిటిషన్ దాఖలు చేశారు. దాన్ని విచారించిన ట్రిబ్యునల్... వ్యర్థాలను సురక్షిత పద్ధతిలో తొలగించాలని విద్యుత్ బోర్డుకు రెండేళ్ల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికీ తొలగించకపోవడంతో రూ. లక్ష జరిమానా విధించడంతో పాటు వ్యర్థాలు తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది.

గంజాయి విక్రయించిన హిజ్రాల అరెస్ట్


గంజాయితో పట్టుబడ్డ హిజ్రాలు

ప్యారీస్, ఫిబ్రవరి 4: స్థానిక షోళింగనల్లూర్‌లో చట్టవిరుద్ధంగా గంజాయి విక్రయించిన ఐదుగురు హిజ్రాలను అరెస్ట్ చేసి, వారి నుంచి 60 కిలోల గంజాయి, బైక్ స్వాధీనం చేసుకున్నారు. షోలింగనల్లూర్, సెమ్మంజేరి, పెరుంబాక్కం, పాత మహాబలిపురం పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు సెమ్మం జేరి పోలీసులకు అందిన సమాచారంతో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఇందులో పెరుంబాక్కానికి చెందిన అపర్ణ, ఆనంది, సుజి, అబి సహా ఐదుగురు హిజ్రాలు గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారి ఇంట్లో సోదాలు చేపట్టి 60 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని వారిని అరెస్ట్ చేశారు.

రేషన్ బియ్యం స్మగ్లింగ్

● ఐదుగురి అరెస్టు ● 1250 కేజీల బియ్యం స్వాధీనం

అడయార్, ఫిబ్రవరి 4: నగరంలోని పలు ప్రాంతాల నుంచి రేషన్‌బియ్యాన్ని సేకరించి, అక్రమంగా ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్న ముఠాను నగర పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా నేత కోసం గాలిస్తున్నారు. ఈ ముఠా సభ్యుల నుంచి 1250 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఉత్తర చెన్నైలోని వాషర్‌మెన్‌పేట, తండయారుపేట, కొరుకుపేట తదితర ప్రాంతాల్లో రేషన్ షాపుల్లో ఉచితంగా ఇచ్చే రేషన్ బియ్యాన్ని అతి తక్కువ ధరకు సేకరించి, ఆ బియ్యాన్ని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాలకు స్మగ్లింగ్ చేస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో చెన్నై నార్త్ విభాగం పోలీస్ ఇన్‌స్పెక్టర్ హేమలత ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం పలు ప్రాంతాల్లో తనిఖీలు చేసి, అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించింది. వారంతా రేషన్ బియ్యాన్ని సేకరించి, పొరుగు రాష్ట్రాలకు తరలిస్తున్నట్టు తేలింది. దీంతో తండయారుపేటకు చెందిన వడివేల్, శక్తివేల్, జోసెఫ్, వెంకటేశన్, కార్తీక్‌లను అరెస్టు చేసింది. 50 కిలోలతో కూడిన 25 బస్తాల రేషన్ బియ్యంతో నాలుగు బైక్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు.

నేత్రదానం చేసిన విద్యార్థి మృతిదేహానికి ప్రభుత్వ ఆధ్వర్యంలో అంత్యక్రియలు

అడయార్, ఫిబ్రవరి 4: మూర్ఛ వ్యాధి కారణంగా మృతి చెందిన ఏడో తరగతి విద్యార్థి హరిహరన్ (12) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విద్యార్థి రెండు నేత్రాలను తల్లిదండ్రులు దానం చేశారు. దీంతో ఆ చిన్నారి మృతదేహానికి ప్రభుత్వ ఆధ్వర్యంలో అంత్యక్రియలు జరిగాయి. నగర శివారు ప్రాంతమైన ఆవడి, పాలవేడుసాలైకు చెందిన అమర్నాథ్ కుమారుడు హరిహరన్ మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 1న పాఠశాలలో మరోమారు అస్వస్థతకు లోనుకావడంతో తొలుత ఆవడి ప్రభుత్వ ఆస్పత్రికి ఆ తర్వాత రాజీవ్ గాంధీ జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వచ్చిన హరిహరన్ శనివారం మృతి చెందాడు. దీంతో తమ కుమారుడి నేత్రాలను తల్లిదండ్రులు దానం చేశారు. అదేసమయంలో హరిహరన్ అంతిమ సంస్కారాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించారు.

లోక్‌సభ ఎన్నికల్లో విజయ్ పార్టీ ప్రభావం తక్కువే

● కేంద్ర మంత్రి మురుగన్

ప్యారీస్, ఫిబ్రవరి 4: సినీ హీరో విజయ్ కొత్త పార్టీ ప్రారంభించినప్పటికీ, పార్లమెంటు ఎన్నికల్లో వారు ప్రేక్షకులుగా మాత్రమే ఉంటారని బీజేపీ నేత, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ అభిప్రాయపడ్డారు. కోయంబత్తూర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన బీజేపీ నిర్వాహకుల సమావేశంలో ఆ పార్టీ జాతీయ ప్రిసీడియం కార్యదర్శి సంతోష్, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ పాల్గొన్నారు. ప్రచార యుక్తి, ప్రజాదరణ కలిగిన నాయకులను ఎంపీ అభ్యర్థులుగా ఎంపిక చేయాలి తదితర అభిప్రాయాలను సమావేశంలో పాల్గొన్న నాయకులు వెల్లడించారు. సమావేశం అనంతరం మురుగన్ మాట్లాడుతూ... పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన కూటమి, అభ్యర్థుల వివరాలను అధిష్ఠానం ప్రకటిస్తుందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కోవై స్థానంలో పోటీ చేసేందుకు అవకాశం కల్పిస్తే ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. 2014 పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ కూటమికి 19 శాతం ఓట్లు, ధర్మపురి, కన్నియాకుమారి స్థానాల్లో విజయం సాధించామన్నారు. దేశ భద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన ఎన్ఐఏ సంస్థ దేశ సమైక్యతకు భంగం కలిగించే వారిపై తగిన చర్యలు చేపడుతుందని, ఆ అధికారుల చర్యల వల్ల ఉగ్రవాద కార్యకలాపాలు నశించిపోతాయని మురుగన్ తెలిపారు.

పెద్ద పార్టీలు మాతో టచ్‌లో ఉన్నాయి...!

● మాజీ మంత్రి డి.జయకుమార్

పెరంబూర్, ఫిబ్రవరి 4: కూటమిలో చేరేందుకు పెద్ద పార్టీలు సంప్రదింపులు జరుపుతున్నాయని అన్నాడీఎంకే మాజీ మంత్రి డి.జయకుమార్ తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టో తయారీకి సంబంధించి అన్నాడీఎంకే రెండో విడత సమావేశం స్థానిక రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం జరిగింది. సమావేశంలో మాజీ మంత్రి జయకుమార్, ఓఎస్ మణియన్, ఆర్బీ ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం జయకుమార్ మీడియాతో మాట్లాడుతూ... ఎన్నికల మేనిఫెస్టో తయారీ పనులు ప్రారంభించామని, సోమవారం నుంచి ప్రజల వద్దకు నేరుగా వెళ్లి వారి అభిప్రాయాలు సేకరిస్తామన్నారు. సోమవారం వేలూరు జిల్లా, 6న విల్లుపురం జిల్లాల్లో ప్రజలను కలుసుకోనున్నామన్నారు. అలాగే, మండలాల వారీగా ప్రజాభిప్రాయాలను తెలుసుకుంటామన్నారు. అదే సమయంలో ప్రజలు తమ సమస్యలు నేరుగా కానీ, ఈ-మెయిల్, తపాలా ద్వారా తెలపాలని కోరామన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ మినహా ఇతర పార్టీలను ఆహ్వానిస్తున్నామన్నారు.

ఈడీకి మా తలుపులు తట్టే అవకాశం లేదు

● అన్నామలై వ్యాఖ్యలకు మంత్రి దురైమురుగన్ కౌంటర్

పెరంబూర్, ఫిబ్రవరి 4: ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి తమ తలుపులు తట్టాల్సిన అవసరం రాదని అన్నామలైకు మంత్రి దురైమురుగన్ బదులిచ్చారు. కేవీ కుప్పంలో శనివారం జరిగిన 'ఎన్‌మన్... ఎన్ మక్కల్ పాదయాత్రలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై మాట్లాడుతూ... వేలూరు ఎంపీ కదిర్ ఆనంద్ ఇంటి తలుపులు త్వరలోనే ఈడీ తడుతుందని వ్యాఖ్యానించారు. అన్నామలై వ్యాఖ్యలపై ఆదివారం మంత్రి దురైమురుగన్ స్పందిస్తూ... వారేమీ తమ తలుపులు తట్టాల్సిన అవసరం లేదని, అంతటి కష్టం వారికెందుకు, తామే తెరచి ఉంచుతామన్నారు. ఆర్థికాభివృద్ధిలో రాష్ట్రం తిరోగమనంలో ఉందనే అన్నామలై ఆరోపణలకు మంత్రి స్పందిస్తూ... ఆయన ఎక్కడ చూశారు, నిష్ణాతులైన ఆర్థిక నిపుణులే తమ ప్రభుత్వానికి సర్టిఫికెట్లు ఇస్తున్నారని చెప్పారు. అలాగే, పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి వస్తున్న వదంతులకు బదులు చెప్పలేనని, ఒకవేళ అలా చెబితే, ఏదో ఒక దానికి పట్టుకొని గందరగోళం చేస్తారని, కూటమిపై త్వరలోనే ప్రకటన వెలువడుతుందని మంత్రి దురైమురుగన్ తెలిపారు.

ఎంఎన్‌ఎంతో చర్చలపై స్టాలిన్‌దే నిర్ణయం

● మంత్రి ఐ.పెరియస్వామి

పెరంబూర్, ఫిబ్రవరి 4: కమలహాసన్ నేతృత్వంలోని మక్కల్ నీతి మయ్యం పార్టీని చర్చలకు ఆహ్వానించడంపై డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ నిర్ణయం తీసుకుంటారని మంత్రి ఐ.పెరియస్వామి తెలిపారు. నగరంలో ఆదివారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. విదేశాల నుంచి వచ్చిన తర్వాత కూటమి పార్టీలకు సీట్ల కేటాయింపులపై నిర్ణయం తీసుకుంటారన్నారు. తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 40 లోక్‌సభ స్థానాలు కైవసం చేసుకోవాలని డీఎంకే కూటమి లక్ష్యమని, ఆ దిశగా సీట్ల కేటాయింపులో ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా సవ్యంగా సాగుతాయని మంత్రి తెలిపారు.

డీఎంకే ఆందోళన ఎన్నికల నాటకం

● టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్

పెరంబూర్, ఫిబ్రవరి 4: కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా డీఎంకే ఎంపీ చేపట్టనున్న ఆందోళన ఎన్నికల నాటకమేనని తమిళ మానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే వాసన్ విమర్శించారు. తిరుప్పూర్ జిల్లా కున్నత్తూర్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 2021 శాసనసభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిలో ఉన్న పార్టీలతో స్నేహసంబంధాలు కలిగి ఉన్నామన్నారు. రాజ్యసభ సభ్యుడి హోదాలో ప్రతిపక్ష నేతను సంప్రదించి, దేశంలో నెలకొన్న పరిస్థితుల గురించి చర్చించామని తెలిపారు. ఇండియా కూటమి పార్టీల్లో సఖ్యత లేదని, ఆయా పార్టీల మధ్య విభేదాలను దేశ ప్రజలు గమనిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విదేశీ పర్యటనపై శ్వేతపత్రం విడుదల చేయాలని జీకే వాసన్ డిమాండ్ చేశారు.

బీజేపీ కూటమిలోనే ఉన్నాం

● మాజీ సీఎం ఓపీఎస్

పెరంబూర్, ఫిబ్రవరి 4: బీజేపీ కూటమిలో తామూ ఉన్నామని, ప్రధానిగా మూడోసారి మోదీ అధికారం చేపడతారని మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్ సెల్వం తెలిపారు. నాగర్‌కోయిల్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... అన్నాడీఎంకేను ఎంజీఆర్ ప్రారంభించిన సమయంలోనే పార్టీ సాధారణ సభ్యుడు కూడా ప్రధాన కార్యదర్శి అయ్యేలా విధివిధానాలు రూపొందించారన్నారు. ప్రధాన కార్యదర్శిని సభ్యులే ఎంపిక చేయాలనే నిబంధనను ఎడప్పాడి పళనిస్వామి మార్చారన్నారు. 10 జిల్లా కార్యదర్శులు, ఐదుగురు సర్వసభ్య మండలి సభ్యులు మద్దతు ఇవ్వాలని మార్చారని అన్నారు. అలాంటి నిబంధనలతో డబ్బున్న వారు మాత్రమే ప్రధాన కార్యదర్శి అవుతారని, ఇలాంటి పరిస్థితి మార్చేందుకు తాము ధర్మ యుద్ధం చేపట్టామన్నారు. అన్నా వర్ధంతి సందర్భంగా శశికళతో మర్యాదపూర్వంగా కలిశానని, ఇందులో రాజకీయాలు ఏమీ లేవని పన్నీర్‌సెల్వం పేర్కొన్నారు.

తీవ్రవాద చర్యలను ఉక్కుపాదంతో అణిచివేయాలి

● బీజేపీ నేత హెచ్.రాజా

ప్యారీస్, ఫిబ్రవరి 4: తీవ్రవాద చర్యలకు పాల్పడుతున్న సంస్థలను ఉక్కుపాదంతో అణిచివేయాలని బీజేపీ మాజీ జాతీయ కార్యదర్శి హెచ్.రాజా డిమాండ్ చేశారు. ఆయన తిరుచ్చిలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... దేశంలో నిషేధించిన ఎల్టీటీఈ నుంచి నామ్ తమిళర్ కట్చికి చెందిన నాయకులకు భారీస్థాయిలో నిధులు ముట్టాయని, వీరి నివాసాల్లో ఎన్ఐఏ నిర్వహించిన సోదాల్లో తుపాకి, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిని క్షమించరాదన్నారు. ఎవరికి వ్యతిరేకంగా ఉపయోగించేందుకు ఆయుధాలు సేకరించారన్న వాస్తవం తెలియాల్సి ఉందని, దీనిపై ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. డీఎంకే ప్రభుత్వం, రాష్ట్ర పోలీసులు బీజేపీ కార్యకర్తలు, నాయకుల పట్ల కక్ష్య సాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని, దీనిని ఖండిస్తూ పార్టీ తరఫున పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టనున్నట్లు హెచ్.రాజా తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి


ప్రమాదానికి గురైన కారు

పెరంబూర్, ఫిబ్రవరి 4: పుదుకోట సమీపంలో ఆదివారం తెల్లవారుజామున కారు, సరుకుల ఆటో ఢీకొన్న ఘటనలో దంపతులు మృతి చెందారు. రామనాథపురం జిల్లా ఆర్ఎస్ మంగళానికి చెందిన ఎస్.గోవిందన్ (60), ఆయన భార్య ఉమామహేశ్వరి (50), కుమారుడు ప్రవీణ్ సుందర్‌తో కలసి తిరుచ్చి మార్గంగా తిరువణ్ణామలైకు కారులో విహార యాత్రకు బయల్దేరారు. ప్రవీణ్ నడుపుతున్న కారు పుదుకోట జిల్లా సత్యమంగళం ప్రాంతంలో వస్తుండగా ఎదురుగా వచ్చిన సరుకుల ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో గోవిందన్, ఉమమహేశ్వరి సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, గాయపడిన ప్రవీణ్ సుందర్, ఆటో డ్రైవర్ గౌతమ్‌ను చుట్టుపక్కల వారు పుదుకోట ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించారు. గణేశ్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

చోరీ కేసుల్లో 28 మంది అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 4: రాజధాని నగరంలో గత వారం రోజుల్లో పలు చోరీ కేసులకు సంబంధించి 28 మందిని అరెస్ట్ చేసినట్లు గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయం తెలిపింది. వాహనాల దొంగతనం, సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్, ఎలక్ట్రానిక్ పరికరాల దోపిడీని అరికట్టేందుకు తనిఖీలు ముమ్మరం చేయాలంటూ పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ అన్ని పోలీస్‌స్టేషన్లకు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు క్రైం విభాగం పోలీసు ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు గత నెల 28 నుంచి శనివారం వరకు పలు పోలీస్‌స్టేషన్లలో నమోదైన దోపిడీ కేసుల వివరాలను బట్టి మొత్తం 28 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 34.3 సవర్ల బంగారం నగలు, 315 గ్రాముల వెండి వస్తువులు, 8 సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్, రూ.1,78,900 నగదు స్వాధీనం చేసుకున్నారు. వాహనాల చోరీకి సంబంధించి నమోదైన ఓ కేసులో ఒకరిని అదుపులోకి తీసుకొని ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

స్టేడియాల అభివృద్ధికి రూ.25 కోట్లు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 4: నగరంలోని స్టేడియాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.25 కోట్లు కేటాయించింది. ఎగ్మోర్‌లో ఉన్న మేయర్ రాధాకృష్ణన్ హాకీ స్టేడియానికి రూ.11.34 కోట్లు, చెన్నై సెంట్రల్ సమీపంలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియానికి రూ.5.71 కోట్లు, జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియానికి రూ.2.35 కోట్లు, వేళచ్చేరి స్విమ్మింగ్ పూల్ కు రూ.4.72 కోట్లు, నుంగంబాక్కం టెన్నిస్ స్టేడియానికి రూ.88 లక్షలు కేటాయించినట్లు ప్రభుత్వం పేర్కొంది.

ఇక 'సూపర్‌స్టార్ ట్యాగ్' చర్చకు తెరపడినట్టేనా?



రజనీకాంత్ - విజయ్

తమిళ చిత్రపరిశ్రమకు చెందిన ఇద్దరు అగ్రనటులైన 'సూపర్‌స్టార్' రజనీకాంత్, 'దళపతి' విజయ్ అభిమానుల మధ్య గత కొన్నేళ్లుగా 'సూపర్‌స్టార్' ఎవరన్న దానిపై చర్చ సాగుతూ వచ్చింది. కోలీవుడ్ 'సూపర్‌స్టార్ తలైవర్' అని రజనీకాంత్ అభిమానులు అంటే.. కాదు ఇపుడు 'తమిళ సూపర్‌స్టార్ దళపతి' అంటూ విజయ్ అభిమానులు వీరావేశంతో నినాదాలు చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో 'జైలర్' చిత్రం ఆడియో రిలీజ్ వేడుకలో రజనీకాంత్ చెప్పిన 'కాకి-గద్ద' కథ ఆ వివాదానికి మరింత ఆజ్యం పోసింది. అయితే, 'లాల్ సలాం' చిత్రం ఆడియో రిలీజ్ వేడుకలో రజనీకాంతే స్వయంగా ఆ వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నం చేశారు. ఇపుడు విజయ్ తన రాజకీయ ప్రయాణంలో తొలి అడుగు వేశారు. దీంతో విజయ్ అభిమానులు ఇకపై రజనీకాంత్, అజిత్ అభిమానులతో గొడవలకు, వాగ్వాదానికి దిగే అకాశం ఉండదు. 'గోట్', 'విజయ్ 69' చిత్రాలను పూర్తి చేసిన తర్వాత పూర్తి స్థాయి రాజకీయాలకు పరిమితంకానున్నట్టు విజయ్ ప్రకటించారు. దీంతో ఈ రెండు చిత్రాల తర్వాత 'సూపర్‌స్టార్', 'అత్యధిక వసూళ్లు' అనే మాటల చర్చకు శుభం కార్డు పడినట్టే. పైగా విజయ్ 'తమిళ వెట్రి కళగం' పేరుతో పార్టీని ప్రకటించగానే ఆయన అభిమానులు సూపర్‌స్టార్ రచ్చను పక్కనబెట్టి.. '2026లో ముఖ్యమంత్రి విజయ్' అంటూ సరికొత్త చర్చకు తెరలేపారు.

పెళ్లి పీటలెక్కనున్న రోబో శంకర్ కుమార్తె



ఇంద్రజ - కార్తీక్ నిశ్చితార్థ దృశ్యం

చిత్రజ్యోతి

ప్రముఖ హాస్య నటుడు రోబో శంకర్ కుమార్తె, సినీ నటి ఇంద్రజ త్వరలోనే పెళ్లిపీటలెక్కనున్నారు. ఆమె కార్తీక్ అనే యువకుడిని పెళ్లాడనున్నారు. వీరి నిశ్చితార్థం తాజాగా నగరంలో ఇరు కుటుంబ సభ్యులు, అతికొద్దిమంది స్నేహితుల సమక్షంలో జరిగింది. ఆ ఫొటోలను రోబో శంకర్ సోషల్ మీడియాలో విడుదల చేశారు. కాబోయే వధూవరులను రోబో శంకర్ దంపతులు ఆశీర్వదిస్తున్న దృశ్యాలు ఇందులో ఉన్నాయి. కాగా, ఇంద్రజ కూడా తన తండ్రిబాటలోనే నడుస్తున్నారు. విజయ్ హీరోగా అట్లీ దర్శకత్వంలో వచ్చిన 'బిగిల్' చిత్రంలో పాండియమ్మగా, ఫుట్‌బాల్ క్రీడాకారిణిగా నటించారు. ఆ తర్వాత హీరో కార్తీ నటించిన 'విరుమన్' వంటి అనేక చిత్రాల్లో నటిస్తున్నారు. ఆమె పెద్దలు కుదిర్చిన వరుడిని పెళ్లిచేసుకుని స్థిరపడనున్నారు. కాగా, బుల్లితెరపై హాస్య నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న రోబో శంకర్.. ఆ తర్వాత సినిమాల్లో అడుగుపెట్టి బిజీ నటుడిగా మారిన విషయం తెల్సిందే.

మంచి అవకాశం కోల్పోయా

● సాక్షి అగర్వాల్



ఎక్కడో తప్పు జరిగిందని, అందుకే మంచి అవకాశాన్ని కోల్పోయినట్టు కోలీవుడ్ హీరోయిన్ సాక్షి అగర్వాల్ వాపోతున్నారు. 'బిగ్ బాస్' తమిళ సీజన్ 3తో ఒక్కసారిగా వెలుగులోకి వచ్చిన నటి సాక్షి అగర్వాల్. ఇపుడు వరుస సినిమాల్లో నటిస్తూ బిజీ హీరోయిన్‌గా కొనసాగుతున్నారు. అయినప్పటికీ ఆమె మంచి బ్రేక్ లభించలేదు. ఈ క్రమంలో ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... "రాజా రాణి' చిత్రానికి హీరో ఆర్య - దర్శకుడు అట్లీ. ఇందులో నన్ను రెండో హీరోయిన్‌గా ఎంపిక చేసి కబురు పంపారు. రెండు మూడు రోజులు పనిచేశాను. నిర్మాణ సంస్థ గురించి అపుడు పెద్దగా నాకు తెలియదు. రెండు రోజుల పాటు నటించిన తర్వాత మళ్లీ పిలుస్తామని చెప్పారు. కానీ, సినిమా షూటింగ్ పూర్తి చేసి విడుదల కూడా చేశారు. ఏం జరిగిందో ఇప్పటికీ నాకు తెలియదు. ఈ చిత్రంలో నటించకపోవడం ఒక మంచి అవకాశాన్ని కోల్పోయా' అని పేర్కొన్నారు.

'లాల్‌సలాం'తో పోటీకి 'లవర్' సిద్ధం



'లవర్'లో శ్రీగౌరి ప్రియ - మణికంఠన్

కొత్త సంవత్సరంలో జనవరిలో విడుదలైన చిత్రాలు ఆశించిన రీతిలో ప్రేక్షకాదారణకు నోచుకోలేదు. అటు కలెక్షన్లపరంగా ఒక్క చిత్రం కూడా రూ.వంద కోట్ల మార్కును తాకలేదు. కానీ, నిర్మాతలు మాత్రం విజయోత్సవాలను జరుపుకున్నారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి మొదటి శుక్రవారం విడుదలైన చిత్రాల్లో 'వడకుప్పటి రామస్వామి' మాత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా హాస్యభరిత చిత్రంగా నిలిచింది. ఈ నేపథ్యంలో రెండో శుక్రవారమైన ఈ నెల 9న 'లాల్‌సలాం', 'లవర్' చిత్రాలతో పాటు మరికొన్ని విడుదలవుతున్నాయి. వీటిలో 'లాల్ సలాం'లో సూపర్‌స్టార్ రజనీకాంత్ అతిథి పాత్రను పోషించారు. విష్ణువిశాల్, విదార్థ్ హీరోలుగా నటించగా, ఐశ్వర్య రజనీకాంత్ దర్శకురాలు. లైకా ప్రొడక్షన్స్ నిర్మించింది. అదేవిధంగా 'గుడ్‌నైట్' వంటి బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందించిన మణికంఠన్ - ప్రభురామ్ వ్యాస్‌ల కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'లవర్'. శ్రీగౌరి ప్రియ హీరోయిన్. ఈ చిత్రం 'లాల్‌సలాం'తో పోటీ పడుతూ ప్రేక్షకుల ముందుకు వస్తోంది. మరి వీటిలో ఏ సినిమాకు ప్రేక్షకులు పట్టంకడతాలో వేచి చూడాల్సి ఉంది.

శ్రీరామకృష్ణమఠం ఆధ్వర్యంలో 6 నుంచి 'వివేకానంద నవరాత్రి ఉత్సవాలు'



మెరీనాబీచ్‌లోని వివేకానందర్ ఇల్లం

చెన్నై, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూరులోని శ్రీరామకృష్ణ మఠం ఆధ్వర్యంలో మెరీనా బీచ్ లోని వివేకానందర్ ఇల్లంలో ఈనెల 6నుంచి 'వివేకానంద నవరాత్రి' ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆ మఠం జాతీయ ఉపాధ్యక్షుడు స్వామి గౌతమానందజీ మహరాజ్ తెలిపారు. పాశ్చాత్య దేశాల్లో స్వామి వివేకానంద భారతీయ ఆధ్యాత్మిక యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని స్వదేశానికి తిరిగి వచ్చి చెన్నై మెరీనా తీరంలోని ఇక్కడి ఇల్లంలో 1897 ఫిబ్రవరి 6 నుండి 14 వరకు తొమ్మిది రోజుల పాటు బస చేశారని, ఆ రోజులను స్మరించుకునేలా యేటా మఠం ఆధ్వర్యంలో 'వివేకానంద నవరాత్రులు' పేరిట ఉత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతే కాకుండా శ్రీరామకృష్ణమఠం ప్రజాసేవలో 125 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తరుణం కూడా ఇదేనన్నారు. ఈ ఉత్సవాలను ఈనెల 6 నుండి 11 వరకు వివేకానందర్ ఇల్లంలోను, 12 నుంచి 14వ తేదీ వరకు మైలాపూరు మఠంలో జరుగుతాయన్నారు. ఈ ఉత్సవాలు రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు కొనసాగుతాయన్నారు. 6న శ్రీరామకృష్ణమఠం మేనేజర్ స్వామి ధర్మిష్టానంద స్వాగతోపన్యాసంతో ప్రారంభమయ్యే ఉత్సవాల్లో విశిష్ట అతిథిగా సీనియర్ న్యాయవాది కె. పరాశరన్, ప్రత్యేక అతిథులుగా పారిశ్రామికవేత్త కె.నల్లికుప్పుసామి చెట్టి, భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ కె.రామస్వామి, భారత్ పెట్రోలియం మాజీ అధ్యక్షుడు ఎస్. వరదరాజన్ పాల్గొంటారు. గౌతమానందజీ మహరాజ్ భక్తులకు ప్రత్యేక సందేశమిస్తారు. చివరగా విదూషి గాయత్రి వెంకట రాఘవన్ సంగీత కచేరి నిర్వహిస్తారు. 7న జరిగే వేడుకల్లో మద్రాసు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి పీఎన్ ప్రకాష్ విశిష్ట అతిథిగా విచ్చేసి 'స్వామి వివేకానందుడి ఆలోచనలు' అనే అంశంపై ప్రసంగిస్తారు. ప్రముఖ నాట్యగురువు అనితా గుహా బృందం 'రామాయణం'పై భరత నాట్య ప్రదర్శన ఉంటుంది. ఈనెల 8న సంగీత కవి రమణన్ 'చెన్నైలో వివేకానందస్వామి' అనే అంశంపై ప్రసంగిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు ఎం.సోమసుందరం బృందం ఆధ్వర్యంలో 'శ్రీరామకృష్ణ పరమహంస' తొలుబొమ్మలాటను ప్రదర్శించనుంది. 9న సాయంత్రం 5.55 గంటలకు 'నేనెరిగిన వివేకానందస్వామి'పై ప్రముఖ తమిళ రచయిత లేనా తమిళ్‌వానన్ ప్రసంగిస్తారు. 6.35 గంటలకు 'స్వామి వివేకానందర్' పేరుతో సుచిత్రా బాలసుబ్రమణియం హరికథా కాలక్షేపం ఉంటుంది. 10న సాయంత్రం 5.55 గంటలకు 'గురుదేవులు అమృతసూక్తులు'పై 'అముదసురభి' సంపాదకుడు కలైమామణి తిరుప్పూరు కృష్ణన్ ప్రసంగిస్తారు. 6.35 గంటలకు వివేక్‌శంకర్ దర్శకత్వంలో 'స్వామీజీ చికాగో పయనం' నాటకం. 11న సాయంత్రం 5.35 గంటలకు 'వివేకానందుడి ఆదర్శ మార్గం' పై చెన్నై కమర్షియల్ కోర్టు జడ్జి డాక్టర్ ఎల్.ఎస్.సత్యమూర్తి ప్రసంగించనున్నారు. 6గంటలకు గౌతమానందజీ మహరాజ్ అనుగ్రహభాషణం చేయనున్నారు. సాయంత్రం 6.25 గంటలకు కేఆర్‌ఎస్ బృందం ఆధ్వర్యంలో 'తిరునావుక్కరసర్' అనే నాటకాన్ని ప్రదర్శిస్తారు.

శివాలయానికి రోబోటిక్ ఏనుగు



రోబోటిక్ ఏనుగుతో సంగీత అయ్యర్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 4: నీలగిరి జిల్లా గూడలూరు దేవర్ సోలై శివాలయానికి వన్యమృగాల ప్రేమికురాలు రూ.12 లక్షల విలువైన ఏనుగు బొమ్మను కానుకగా అందజేశారు. ప్రవాస భారతీయురాలు, జంతు ప్రేమికురాలైన సంగీత అయ్యర్ గూడలూరులోని దేవర్‌సోలై శివాలయ ఉత్సవాల్లో పాల్గొనేందుకు శనివారం వచ్చారు. ఈ సందర్భంగా ఆమె కాళ్లకు చక్రాలు అమర్చిన రిమోట్ సాయంతో నడిచే రూ.12 లక్షల విలువైన రోబోటిక్ ఏనుగు బొమ్మను ఆలయానికి బహూమతిగా సమర్పించారు. ఈ విషయమై ఆమె మాట్లాడుతూ... ఆలయాల్లో ఏనుగులను గొలుసులతో బంధించి హింసిస్తుండడాన్ని అడ్డుకొనేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఏనుగులు స్వతంత్రంగా జీవించాల్సి ఉండగా, వాటిని ఆలయాల్లో బంధించడం సబబు కాదన్నారు. తాము చేపడుతున్న ప్రయత్నంలో భాగంగా ఈ బొమ్మ ఏనుగును అందజేశానని తెలిపారు.

కరైవెట్టి పక్షుల శరణాలయ పోస్టల్ కవర్ల విడుదల



శరణాయంలో పక్షుల బొమ్మల పోస్టల్ కవర్లు విడుదల చేస్తున్న దృశ్యం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 4: అరియలూరు జిల్లా కరైవెట్టి పక్షుల శరణాలయాన్ని రామ్సర్ సైట్‌గా ప్రకటించడాన్ని స్మరించుకొనేలా ప్రత్యేక తపాలా కవర్ విడుదల చేశారు. చిత్తడి భూముల పరిరక్షణకు 1971లో ఇరాన్ దేశ రామ్సర్ అనే నగరంలో రామ్సర్స్ శాసనం రాశారు. ప్రపంచస్థాయిలో చిత్తడి భూములను రక్షించడమే ఈ శాసనం యొక్క లక్ష్యం. దీని గురించి తపాలా శాఖ విడుదల చేసిన ప్రకటనలో... అరియలూరు జిల్లాలో ఉన్న కరైవెట్టి పక్షుల శరణాలయం 453 హెక్టార్ల విస్తీర్ణంలో ఉండగా, 500కు పైగా వృక్ష, జంతు జాతులున్నాయని పేర్కొంది. దీని పరిసరాల ప్రాముఖ్యాన్ని గుర్తించిన రాష్ట్రప్రభుత్వం 1999లో పక్షుల శరణాలయంగా ప్రకటించింది. 1982లో రామ్సర్ మహానాడులో భారత్ సంతకం చేసింది. ఈ నేపథ్యంలో, ఈ ఏడాది జనవరి 31వ తేది మహానాడు ద్వారా కరైవెట్టి పక్షుల శరణాలయాన్ని అధికారపూర్వంగా రామ్సర్ సైట్‌గా ప్రకటించారు. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 2వ తేది ప్రపంచ చిత్తడి భూముల దినోత్సవం సందర్భంగా కరైవెట్టి పక్షుల శరణాలయంపై ప్రత్యేక పోస్టల్ కవర్‌ను కేంద్ర తపాలా మండల అధ్యక్షురాలు నిర్మలాదేవి విడుదల చేశారు.

వళ్లువర్‌కోట్టమ్ వద్ద రూ.195.19 కోట్లతో కొత్త ఫ్లైఓవర్



వళ్లువర్‌కోట్టమ్ వద్ద నిర్మించనున్న ఫ్లైఓవర్ ఇంజనీరింగ్ ప్లాన్

చెన్నై, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వళ్లువర్‌కోట్టమ్ వద్ద ట్రాఫిక్ రద్దీని శాశ్వతంగా తగ్గించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం రూ.195.19 కోట్లతో కొత్తగా ఫోర్‌వే ఫ్లైఓవర్ నిర్మించనుంది. ఈ రహదారి వంతెన 570 మీటర్ల పొడవు, 15 మీటర్ల వెడల్పు కలిగి ఉంటుంది. ఈ ఫ్లైఓవర్ నిర్మాణానికి 30 మందికి చెందిన స్థలాలను సేకరించాల్సి ఉంది. మొత్తం 10,879 చదరపు మీటర్ల స్థలం ఈ నిర్మాణనికి అవసరమవుతుందని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. స్థల సేకరణ పూర్తయ్యాక టెండర్లు ఆహ్వానిస్తామని అధికారులు తెలిపారు. టెండర్ ఖరారైన వెంటనే 18 నెలల్లో ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తవుతుందని పేర్కొన్నారు.

ఆదికుంబేశ్వరర్ ఆలయ ఏనుగు 'మంగళ'కు అవార్డు



ఏనుగును పరామర్శిస్తున్న మావటి అశోక్‌కు పురస్కారం అందిస్తున్న నిర్వాహకులు

పెరంబూర్, ఫిబ్రవరి 4: రాష్ట్రంలోని 38 ఆలయ ఏనుగుల్లో సక్రమంగా పరామర్శిస్తున్న కుంభకోణం ఆదికుంబేశ్వర్ ఆలయన ఏనుగు మంగళ (56)కు 'యాన్ యాక్టివ్ ఎలిఫెంట్' పురస్కారం ప్రదానం చేశారు. తంజావూరు జిల్లా కుంభకోణంలో 2 వేల ఏళ్లనాటి ప్రాచీనమైన ఆదికుంబేశ్వరర్ స్వామి ఆలయాన్ని దేశ, విదేశాలకు చెందిన భక్తులు సందర్శిస్తుంటారు. ఈ ఆలయంలో మంగళ అనే ఏనుగును సంరక్షిస్తున్నారు. ఆలయ వేడుకలు జరిగే రోజుల్లో మంగళ ముందు వరుసలో ఉంటోంది. అలాగే, ఆలయానికి వచ్చే భక్తులను తన తొండంతో ఆశీర్వదిస్తుంటుంది. అలాగే, ఏనుగు పర్యవేక్షణకు మావటిని నియమించడంతో పాటు దాని కోసం స్విమ్మింగ్ పూల్, వాకింగ్ ట్రాక్ కూడా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో, ఢిల్లీకి చెందిన లోక్‌చంద్ర జౌర్ జనతా అనే స్వచ్ఛంద సంస్థ, రాష్ట్రంలోని 38 ఆలయ ఏనుగుల పర్యవేక్షణపై సర్వే నిర్వహించింది. అందులో ఆదికుంబేశ్వరర్ ఆలయ ఏనుగు మంగళ ఎంపికైంది. ఆదివారం ఉదయం సంస్థ నిర్వాహకులు సుదన్‌బాలన్, అజిత్ కుమార్ ఏనుగును పరామర్శిస్తున్న మావటి అశోక్‌కు నగదు బహుమతి, సర్టిఫికెట్ అందజేశారు. తమ ఆలయ ఏనుగుకు అవార్డు రావడంతో ఆ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

● మంత్రి గాంధీ



సమావేశంలో మంత్రి గాంధీ తదితరులు

పెరంబూర్, ఫిబ్రవరి 4: ప్రభుత్వ అందజేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని జౌళి, చేనేత శాఖ మంత్రి ఆర్.గాంధీ ప్రజలకు పిలుపునిచ్చారు. కరుణానిధి శతజయంతి వేడుకల్లో భాగంగా తిరువళ్లూర్ జిల్లా మీంజూరులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా మంత్రి గాంధీ పాల్గొని, పొన్నేరి, గుమ్మిడిపూండి, మీంజూరు తాలూకాలకు చెందిన 2,973 మందికి పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో పొన్నేరి ఎమ్మెల్యే దురై చంద్రశేఖర్, గుమ్మిడిపూండి ఎమ్మెల్యే టీజే గోవిందరాజన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎ.రాజ్‌కుమార్ సహా పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ



బాధితులకు పౌష్టికాహారం అందజేస్తున్న నిర్వాహకులు

పెరంబూర్, ఫిబ్రవరి 4: ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా క్యాన్సర్ బాధితులకు పౌష్టికాహారం అందించారు. స్థానిక అడయార్ గాంధీనగర్‌లోని క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్న బాధితులకు చెన్నై గ్రీన్ సిటీ అరిమా సంఘం, పసుమై తాయగం సంయుక్త ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి లయన్ రవిచంద్రన్, చెన్నై గ్రీన్ సిటీ అరిమా సంఘం కార్యదర్శి లయన్ అన్నామలై నేతృత్వం వహించారు. ప్రత్యేక అతిథులుగా అరిమా సంఘం జిల్లా గవర్నర్ లయన్ శ్రీధర్, లయన్ యామినిప్రియ, పసుమై తాయగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లయన్ కన్నన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఓటర్ల మద్దతు కోసం పాటుపడాలి

● అన్నాడీఎంకే మహిళా విభాగం తీర్మానం



అన్నాడీఎంకే మహిళా విభాగం సమావేశం

చెన్నై, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో మహిళా ఓటర్ల మద్దతును సేకరించేందుకు పార్టీ నాయకులు శ్రమించాలని ఆదివారం ఉదయం జరిగిన అన్నాడీఎంకే మహిళా విభాగం సమావేశం పిలుపునిచ్చింది. స్థానిక రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో జరిగిన ఈ సమావేశంలో మహిళా విభాగ అధ్యక్షురాలు, మాజీ మంత్రి వలర్మతి, మాజీ మంత్రి రాజలక్ష్మి, మదురాంతకం ఎమ్మెల్యే మరగతం కుమారవేల్, మహిళా విభాగం డిప్యూటీ కార్యదర్శి కృత్తికా మునుసామి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో లోక్‌సభ ఎన్నికల్లో మహిళా విభాగం నిర్వహించాల్సిన ప్రచార వ్యూహాలపై చర్చించారు. అన్ని నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లను పార్టీ వైపు మళ్లించాలని మాజీ మంత్రి వలర్మతి పిలుపునిచ్చారు. డీఎంకే ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారం సాగించాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి జయ జయంతి సందర్భంగా మహిళలకు సహాయాలు పంపిణీ చేయాలని, ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. మార్చి 8న ప్రపంచ మహిళా దినోత్సవాలను భారీ యెత్తున నిర్వహించాలని నిర్ణయించారు.



క్యాన్సర్ అవగాహనపై గ్లెనెగ్లెస్ హెల్త్ సిటీ 'వాకథాన్'

అడయార్, ఫిబ్రవరి 4: నగరంలోని ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రి గ్లెనెగ్లెస్ గ్లోబెల్ హెల్త్ సిటీ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కోసం 'వాకథాన్'ను ఆదివారం నిర్వహించారు. నగరంలోని హిందుస్థాన్ కాలేజీ, ఆసన్ మెమోరియల్ కాలేజ్, మొహ్మద్ సాధిక్ కాలేజీలకు చెందిన దాదాపు 650 మంది విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. వరల్డ్ క్యాన్సర్ డేను పురస్కరించుకుని గ్లోబెల్ హెల్త్ సిటీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. 'క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించండి - ప్రాణాన్ని కాపాడండి, క్యాన్సర్‌పై పోరాడండి - ఆశతో జీవితాన్ని కొనసాగించండి, నేటి అవగాహన - రేపటి నివారణ' అంటూ ఇందులో పాల్గొన్నవారంతా నినాదాలు చేశారు. అలాగే, ప్రతి ఒక్కరూ కేన్సర్ సంరక్షణ కోసం పోరాటం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్లోబెల్ హెల్త్ సిటీకి చెందిన అంకాలజీ విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎస్.రాజాసుందరం, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడలూరు రేవులో జోరుగా చేపల విక్రయం



కడలూరు హార్బర్ వద్ద చేపల కోసం గుమికూడిన జనం

చెన్నై, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కడలూరు రేవులో ఆదివారం ఉదయం మునుపెన్నడూ లేనంతగా భారీస్థాయిలో చేపల విక్రయాలు జరిగాయి. కడలూరు దేవానంపట్టినం, తాళంగుడా, అక్కరైకేరి తదితర గ్రామాల జాలర్లు సముద్రంలో చేపల వేటకు వెళ్ళి మత్స్య సంపదతో కడలూరు హార్బర్‌కు చేరుకోవటం ఆనవాయితీ. ఈ మేరకు ఆదివారం ఉదయం ఈ ప్రాంతాలకు చెందిన జాలర్లు పడవల్లో తీసుకువచ్చిన తాజా చేపలను బుట్టల్లో కిలోల చొప్పున కొనేందుకు మాంసాహార ప్రియులు పోటీపడ్డారు. పొరుగు జిల్లాలకు చెందిన వ్యాపారులు కూడా ఈ రేవు వద్ద చేపలు కొనేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీనితో చేపల ధరలు విపరీతంగా పెరిగాయి. కిలో రూ.250కు విక్రయించిన శంకరా చేపలు రూ.400 పలికాయి. ఇదే విధంగా కిలో పారై చేపలు రూ.450ల నుంచి రూ.500కు, షీలా చేపలు రూ.400కు, వంజరం కిలో రూ.800ల నుండి రూ.1000ల వరకు, నెత్తిలి రకం రూ.300 నుంచి రూ.400లకు విక్రయించారు.

పళని ఆలయంలో తగ్గని భక్తుల రద్దీ

చెన్నై, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పళని దండాయుధపాణి స్వామివారి ఆలయానికి ఆదివారం అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆ ఆలయంలో తైపూసం వేడుకలు ముగిసి వారం రోజులు దాటినా భక్తుల రాక ఏమాత్రం తగ్గలేదు. సెలవురోజైన ఆదివారం పొరుగు జిల్లాల నుంచే కాకుండా కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా వేలాదిమంది భక్తులు పళని క్షేత్రానికి విచ్చేశారు. కేరళ రాష్ట్రం పథనంతిట్ట ప్రాంతానికి చెందిన భక్తులు స్వామివారికి సారె సమర్పించి దర్శించుకున్నారు. గిరి వీధి, పర్వతం దిగువ ప్రాంతం, కొండ మెట్లదారి, రోప్‌కార్ కేంద్రం తదితర ప్రాంతాలు ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ కిటకిటలాడాయి. పర్వతాలయం వద్ద స్వామివారి దర్శనం కోసం భక్తులు క్యూలో గంటల తరబడి బారులు తీరారు.

ప్రశాంతంగా పట్టభద్ర ఉపాధ్యాయ ఎంపిక రాత పరీక్షలు



ట్రిప్లికేన్ ఎన్‌కేటీ స్కూలు పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులు

అడయార్, ఫిబ్రవరి 4: రాష్ట్ర వ్యాప్తంగా పట్టభద్ర ఉపాధ్యాయ పోస్టుల ఎంపిక కోసం ఆదివారం నిర్వహించిన రాత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షలకు సుమారుగా 47 వేల మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో ఖాళీగా ఉన్న డిగ్రీ పట్టభద్రుల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం గత యేడాది అక్టోబరు 25వ తేదీన నోటిఫికేషన్ వెలువడింది. మొత్తం 2222 పోస్టుల భర్తీ కోసం ఈ నోటిఫికేషన్ జారీ చేయగా, గత యేడాది నవంబరు ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ పోస్టుల కోసం 47 వేల మందికిపైగా నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే, గత నెల 7వ తేదీన జరగాల్సిన ఈ పరీక్షలను వర్షం కారణంగా వాయిదా వేసి, ఫిబ్రవరి 4వ తేదీన నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. పాఠశాల విద్యాశాఖలో 2171 ఉపాధ్యాయ పోస్టులకు, బీసీ సంక్షేమ శాఖలోని 23 పోస్టులు, ఆది ద్రావిడ సంక్షేమ శాఖకు చెందిన పాఠశాలల్లోని 12 పోస్టులకు కలిపి ఈ రాత పరీక్ష నిర్వహించారు. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా వందకుపైగా, చెన్నై నగరంలో థౌజండ్‌లైట్, రాయపేట, శాంథోమ్, చెట్‌పట్, వేప్పేరి, పురసైవాక్కంతో సహా మొత్తం ఎనిమిది కేంద్రాలను ఏర్పాటు చేసి, కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించారు.



మైలాపూర్ వళ్లీశ్వరన్ గార్డెన్ ప్రాంతంలో రాష్ట్ర నగర శివారు నివాసాభివృద్ధి సంస్థ నిర్మించిన గృహ సముదాయాలను ప్రారంభిస్తున్న మంత్రి దామో అన్బరసన్